క్లుప్తంగా

నేడు టిప్పు సుల్తాన్ వర్ధంతి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : నేడు టిప్పు సుల్తాన్ వర్ధంతి సందర్భంగా నిర్వహించనున్న కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఆప్‌కీ ఆవాజ్ రాష్ట్ర కార్యదర్శి మగ్బూల్ బాషా పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఆప్‌కీ ఆవాజ్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ మైసూర్ పులిగా పేరొందిన టిప్పు సుల్తాన్ బ్రిటిష్ వారిని ఎదిరించిన గొప్ప యోధుడని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఆప్‌కీ ఆవాజ్ నాయకులు ఈదుల్లా పాల్గొన్నారు.

డీఈఓకు వినతి

కడప ఎడ్యుకేషన్: ముందస్తు అడ్మిషన్ల పేరిట విద్యార్థులకు ఎంట్రెన్స్ టెస్టులు నిర్వహిస్తూ ప్రభుత్వ నిబంధనలను లెక్కచేయని జిల్లాలోని ప్రైవేటు విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని అఖిల భారత విద్యార్థి సమాఖ్య జిల్లా కార్యదర్శి వలరాజు డిమాండ్ చేశారు. ఈ విషయమై బుధవారం డీఈఓ రాఘవరెడ్డిని తమ కార్యాలయంలో కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేటు విద్యాసంస్థలు నియాన్, ఫోకస్, లియో ఐఐటి పేర్లతో పరీక్షలు పెట్టి విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి డబ్బులు రాలేందుకు కుట్ర చేస్తున్నారన్నారు. ఏఐఎఫ్ఎఫ్ నగర అధ్యక్ష, కార్యదర్శులు అరుణ్, శివశంకర్ పాల్గొన్నారు.

ఉచిత విద్యకు దరఖాస్తుల ఆహ్వానం

కడప ఎడ్యుకేషన్ : విద్యాహక్కుచట్టం 2009 ప్రకారం 2023–24 విద్యా సంవత్సరానికి 1వ తరగతికి ప్రైవేటు పాఠశాలల్లో ఉచిత ప్రవేశానికి అర్హులు గల విద్యార్థుల నుంచి రెండో విడత కింద దరఖాస్తులను ఆన్‌లైన్‌లో ఆహ్వానిస్తున్నట్లు కడప మండల ఎంఈఓ పాలెం నారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందుకు సంబంధించి ఏప్రిల్ 6 నుంచి 15వ తేదీ వరకు ప్రభుత్వం అవకాశం కల్పించిందన్నారు. వివరాలు మండల విద్యాశాఖ అధికారి, ఎంఈఓ కార్యాలయ సిబ్బంది లేదా సచివాలయ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ సెక్రటరీని సంప్రదించాలని డీఈఓ నారాయణ సూచించారు.

10న చెట్ల వేలం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ఆర్టీసీ బస్టాండ్ పరిధిలో ఉన్న 25 చెట్లను కొట్టుకుని తీసుకుని పోయేందుకు బహిరంగ వేలం వేస్తున్నామని, ఆసక్తిగల వారు వేలంలో పాల్గొనాలని డిపో మేనేజర్ ఎ.మల్లికార్జునరెడ్డి తెలిపారు. ఈనెల 10న ఉదయం 10 గంటలకు నిర్వహించే ఈ బహిరంగ వేలంలో పాల్గొనదల్చిన వారు రూ.20వేలు సెక్యూరిటీ డిపాజిట్ చెల్లించాల్సి ఉంటుందన్నారు. దాదాపు 20 – 25 టన్నుల వరకు ఉండే ఈ చెట్లను వేలం వేస్తామని, పాట దక్కించుకున్న వారు వెంటనే డబ్బు చెల్లించాల్సి ఉంటుందని వివరించారు.

సింహవాహనంపై చెన్నకేశవుడు



శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వామిని పల్లకిలో ఊరేగిస్తున్న భక్తులు

రాజుపాళెం : మండలంలోని వెల్లాల గ్రామంలో బుధవారం రాత్రి సింహవాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీచెన్నకేశవ స్వామి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించిన పల్లకిలో ఆశీనులు చేసి పురవీధుల్లో ఊరేగించారు. భక్తులు స్వాములను దర్శించుకుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఉదయం ఉత్సవ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి ఊరేగించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కానాల విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకుడు కానాల బలరామిరెడ్డి, సీనియర్ అసిస్టెంట్ రామమోహన్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా బ్రహ్మోత్సవాలు

బి.కోడూరు : మండలంలోని మున్నెల్లి గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీచెన్నకేశవస్వామి, శ్రీరామలింగేశ్వరస్వామీల బ్రహ్మోత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. బుధవారం స్వామి వారికి ద్వారతోరణ ధ్వజకుంభ ప్రార్థన, అగ్ని ప్రతిష్ట, అభిషేకం తదితర కార్యక్రమాలను వేదపండితులు సూర్యప్రకాశరావు, పెద్ద వీరయ్య, పిచ్చయ్యల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి ప్రత్యేక అలంకరణలో ఉంచారు. భక్తులు పాల్గొని స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

సీఐ, ఎస్ఐలపై చర్యలు తీసుకోవాలి

కమలాపురం : గత నెల 30వ తేదీన కడప ఐటీఐ సర్కిల్ వద్ద సీపీఐ సీపీఎం చేపట్టిన ప్రచార భేరిని అడ్డుకుని సీపీఐ నాయకుడు, న్యాయవాది సంఘం జిల్లా అధ్యక్షుడు సుబ్రమణ్యంను అదుపులోకి తీసుకుని చితకబాదిన కడప తాలూకా సీఐ ఉలసయ్యను, ఎస్ఐలు రామకృష్ణ, తాహిర్‌లపై చర్యలు తీసుకునే వరకు ఉద్యమం ఆగదని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొమ్మద్ది ఈశ్వరయ్య, డీడీకేఎస్ జిల్లా అధ్యక్షుడు నాగేశ్వరరావు, చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పల్లా వరప్రసాద్‌లు బుధవారం కమలాపురంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో డిమాండ్ చేశారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రధాన ధ్యేయం

ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి



ప్రజలకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే పీ రవీంద్రనాథ్‌రెడ్డి

వల్లూరు : ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పాలన సాగిస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సారథ్యంలోని వైఎస్ఆర్‌సీపీ ప్రభుత్వం ప్రజల సమస్యలను క్షేత్ర స్థాయిలో తెలుసుకుని వాటిని పరిష్కరించడమే ప్రధాన ధ్యేయంగా గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని కమలాపురం ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి తెలిపారు. మండలంలోని కొట్లూరు గ్రామ పంచాయతీ పరిధిలోని కొట్లూరు, బాకరాపురం, బీచువారిపల్లె గ్రామాల్లో బుధవారం జరిగిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో చింతకొమ్మదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులురెడ్డితో కలిసి ఆయన ఇంటింటికీ తిరిగి ఆయా కుటుంబాలకు ప్రభుత్వం అందించిన సంక్షేమ పథకాల గురించి వివరించారు. అర్హత వుండి ఏవైనా పథకాలు అందకుంటే తెలపండి వాటిని పరిష్కరిస్తామని ఆయన ప్రజలకు భరోసా ఇచ్చారు. కొట్లూరు, బీచువారిపల్లె ఎస్సీ కాలనీ, బాకరాపురం గ్రామాలలో సీసీ రోడ్లు వేయాలని ప్రజలు కోరగా వాటిని మంజూరు చేస్తామని ఆయన వారికి హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ అబ్బిరెడ్డి వీరారెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నేతలు నాగిరెడ్డి, వెంకటసుబ్బారెడ్డి, మస్తాన్, అంకిరెడ్డి, పుల్లయ్య, ఏసు, ఇందిరెడ్డి శంకర్‌రెడ్డి, ఎంపీడీఓ జుబేద, తహసీల్దార్ అమరేశ్వరి, ఈఓ పీఆర్‌డీ ప్రసాద్, ఎంఈఓ లిల్లెమ్మ, ఏఓ సాయిశైలజ, ఏఈలు ప్రతాప్‌రెడ్డి, పవన్, ముజీబ్, డానియల్ జోసెఫ్, ఏపీఎం శైలజ, వివిధ శాఖల అధికారులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి భూమిపూజ

చింతకొమ్మదిన్నె : మండలంలోని అప్పరాజుపల్లె గ్రామంలో బుధవారం చౌడేశ్వరిదేవి ఆలయ నిర్మాణానికి ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి భూమిపూజ చేశారు. కార్యక్రమంలో వైఎస్ఆర్‌సీపీ నాయకులు వేణుగోపాల్, రఘునాథరెడ్డి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

చదువుతో విజ్ఞానం.. మంచి జీవితం



జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

కడప కల్చరల్ : చదువుతోనే విజ్ఞానం లభిస్తుందని, దాంతో మంచి జీవితాన్ని పొందవచ్చని జన విజ్ఞాన వేదిక ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు అన్నారు. సంస్థ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం స్థానిక రవీంద్రనగర్‌లోని విద్యానికేతన్ హైస్కూల్లో నిర్వహిస్తున్నారు. ఇందులో భాగంగా బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన విద్యార్థులకు విజ్ఞానం అవసరం గురించి వివరించారు. ప్రధానంగా దేశాన్ని నడిపే ప్రధానమైన వ్యక్తులు, వారి ఎన్నిక, రాష్ట్రాలు, ప్రతినిధులు, బాధ్యతలు, హక్కుల గురించి వివరించారు. ఉపాధ్యాయుడు, జేవీవీ కోశాధికారి షామీర్ మానవ జీవితంలో సైన్స్‌కుగల ప్రాధాన్యత గురించి వివరించారు. జన విజ్ఞాన వేదిక నాయకులు కిరణ్, సంస్థ సాంస్కృతిక విభాగం ప్రతినిధి రంగనాయకులు, కరీముల్లా తదితరులు పాల్గొన్నారు.

ప్రస్తుత ఖాజీలకూ పదేళ్ల కాలపరిమితి ఇవ్వాలి

కడప కార్పొరేషన్ : ప్రస్తుతం పనిచేస్తున్న ప్రభుత్వ ఖాజీలను పదేళ్ల కాలపరిమితి ఇవ్వాలని ప్రభుత్వ ఆర్‌టీ ఖాజీల అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి హఫీజ్ మహమ్మద్ ఇసాక్ సాహెబ్ జియాయి కోరారు. బుధవారం సాయంత్రం వక్ఫ్‌బోర్డు స్పెషలాఫీర్ షీరీన్‌కు వినతిపత్రం అందజేశారు. గతంలో మూడేళ్లకొకసారి ఖాజీలను రెన్యువల్ చేసేవారని, ప్రస్తుత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం దాన్ని పదేళ్లకు పొడిగించడం సంతోషకరమన్నారు. అయితే కొత్తగా నియమితులైన వారికే పదేళ్ల వర్తిస్తోందని, ఇదివరకే పనిచేస్తున్నవారు మూడేళ్లకు రెన్యువల్ చేసుకున్న తర్వాత పదేళ్ల కాలపరిమితి వర్తిస్తుందని చెప్తున్నారని పేర్కొన్నారు. ఇలా చేస్తే ఖాజీలకు ఇబ్బంది అవుతుందని తెలిపారు.

విద్యావ్యవస్థ అస్తవ్యస్తం

కడప ఎడ్యుకేషన్ : విద్యారంగ సంస్కరణల వల్ల విద్యార్థులకు నాణ్యమైన విద్య అందకపోగా, విద్యావ్యవస్థ మొత్తం అస్తవ్యస్తంగా మారిందని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్ష, ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, కేఎస్ఎస్ ప్రసాద్ విమర్శించారు. బుధవారం కడపలోని యూటీఎఫ్ కార్యాలయంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రణాళిక లేకుండా హడావుడిగా ప్రవేశపెట్టిన విద్యారంగ సంస్కరణల వల్ల ఒక కిలోమీటర్‌లో ఉన్న ప్రాథమిక పాఠశాలలోని 3,4,5 తరగతులను ఉన్నత పాఠశాలలోకి విలీనం చేశారన్నారు. ఈ విద్యార్థులకు ఎలాంటి విద్య అందుతుందో పట్టించుకునేవారే లేరని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్నత పాఠశాలలో ఉన్న విద్యార్థులకు సబ్జెక్టు టీచర్ల కొరత లేకుండా చేస్తామని చెప్పి కూడా అమలు కాలేదని విమర్శించారు. విద్యాశాఖ వెకేషన్ డిపార్టుమెంట్ అని వేసవి సెలవుల్లో కూడా వివిధ కార్యక్రమాలు చేయాలని ఉత్తర్వులు ఇవ్వడం తగదన్నారు. ఈ వేసవి సెలవులు ముగిసిలోపు బదిలీలు, ప్రమోషన్లను పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శులు లక్ష్మిరాజా, నాగమణి, కోటేశ్వరప్ప, వివిధ జిల్లాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పాల్గొన్నారు.

విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకుందాం



పోస్టల్ ప్రధాన కార్యాలయం ఎదుట నిరసన చేపడుతున్న వామపక్ష నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం నుంచి విశాఖ ఉక్కు పరిశ్రమను కాపాడుకుందామని సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పిలుపునిచ్చారు. బుధవారం విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ వామపక్షాల ఆధ్వర్యంలో నగరంలోని పోస్టల్, బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయాల ఎదుట నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశభక్తి పేరుతో కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దక్షిణ కొరియా చెందిన పోస్కో, అదానీలకు విశాఖ ఉక్కు పరిశ్రమను నూరు శాతం అప్పగించాలని కుట్ర పన్నడం దారుణమన్నారు. విశాఖ ఉక్కు పరిశ్రమ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్నా మోదీ ప్రభుత్వం స్పందించకపోవడం దారుణమన్నారు. వామపక్ష నాయకులు మనోహర్, వేణుగోపాల్, శ్రీనివాసులు రెడ్డి, వెంకటశివ, రామ్మోహన్, మద్దిలేటి పాల్గొన్నారు.

ఖ్వాజా సుజుకి వర్క్‌షాప్ ప్రారంభం



వర్క్‌షాప్ ప్రారంభోత్సవం సందర్భంగా అతిథులను ఆహ్వానిస్తున్న ఖ్వాజా సుజుకి షోరూం ప్రతినిధులు

కడప కల్చరల్ : కడప నగరం చిన్నచౌకులో ఖ్వాజా సుజుకి వారి నూతన ఆటోమేటెడ్ వర్క్‌షాప్‌ను సుజుకి మోటార్స్ సైకిల్ ఇండియా ప్రైవేటు లిమిటెడ్ రీజినల్ మేనేజర్ సునీల్ సేన్ ప్రారంభించారు. ఖ్వాజా సుజుకి ఎండీ ఎస్ఎండీ సొహైల్ ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికి మార్కెట్‌లో ప్రతి వినియోగదారునికి మంచి సర్వీసుతోపాటు స్పేర్ పార్ట్స్ అందుబాటులో ఉంచుతున్నామన్నారు. ప్రస్తుతం నూతన ఆటోమేటెడ్ వర్క్‌షాప్ అందరికీ అందుబాటులో ఉంటుందన్నారు. సుజుకి మోటారు సైకిల్ ఏరియా మేనేజర్ ఎం.రమణ బాహం సేన్ మాట్లాడారు. ఖ్వాజా సుజుకి గ్రూప్స్ అధినేత సయ్యద్ అబ్దుల్‌ఖాదర్, ఎస్ఎండీ సొహైల్, రీహాన్, షయాన్, కడప, ప్రొద్దుటూరు సుజుకి షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి బోగాదమ్మ తిరునాల

వీరపునాయునిపల్లె : మండలంలోని అనిమెల గ్రామ సమీపంలోని కోరుకొండపై వెలసిన బోగాదమ్మ తిరునాల బుధవారం రాత్రి బియ్యం కొలతతో ప్రారంభమైంది. ఈ తిరునాల నాలుగు రోజులపాటు కొనసాగనుంది. గురువారం అమ్మవారికి కుంభబలి, రాత్రి 8 గంటలకు పొంగుపాలు, శుక్రవారం ఉదయం 9 గంటలకు అమ్మవారు భక్తులకు దర్శనం, సాయంత్రం 3 గంటలకు గ్రామంలోని రైతులు వృషభ రాజములచే అమ్మవారి గుడి చుట్టూ శిరిమాను ఉత్సవం, రాత్రి 9 గంటలకు నెల్లూరు సరస్వతీ నాట్యమండలి వారిచే పౌరాణిక నాటకం, శనివారం మధ్యాహ్నం 12 గంటలకు అన్నదాన కార్యక్రమం, సాయంత్రం 3గంటలకు పొరుగు గ్రామాలకు చెందిన రైతులు వృషభ రాజములచే అమ్మవారి గుడి చుట్టూ శిరిమాను ఉత్సవం, రాత్రి 9 గంటలకు పాటకచేరి, ఆదివారం ఉదయం అమ్మవారు పాలేటికి తరలుతుందన్నారు.

వాటర్ ప్లాంట్లు మంజూరు

వీరపునాయునిపల్లె : కమలాపురం నియోజకవర్గంలోని ఆరు మండలాలకు సంబంధించి ఆంధ్రప్రదేశ్ మినిరల్ డెవలప్‌మెంటు కార్పోరేషన్ సౌజన్యంతో 25 మినిరల్ వాటర్ ప్లాంట్లు మంజూరైనట్లు రాష్ట్ర మైనింగ్ డైరెక్టర్ లింగారెడ్డి వీరప్రతాప్‌రెడ్డి తెలిపారు. బుధవారం వీరపునాయునిపల్లెలో ఆయన విలేకరులతో మాట్లాడారు. ప్లాంట్ల మంజూరులో ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి కృషి మరువలేనిదన్నారు. 5 ప్లాంట్లు ప్రారంభించామని, 11 ప్లాంట్లు ప్రారంభానికి సిద్ధంగా ఉన్నాయని, మరో 9 ప్లాంట్లు నిర్మాణంలో ఉన్నాయన్నారు. అలాగే మరో 20 ప్లాంట్ల మంజూరుకు ప్రతిపాదనలు పంపించామన్నారు. ఒక్కో ప్లాంటు రూ.6.5 లక్షలతో నిర్మిస్తున్నామన్నారు. కార్యక్రమంలో మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు నరేష్‌రెడ్డి, కమలాపురం మార్కెట్‌యార్డ్ మాజీ వైస్ చైర్మన్ గంగిరెడ్డి, యరమలపల్లె సర్పంచ్ సౌజన్యరెడ్డి, కమలాపురం మండలం వైసీపీ నాయకుడు వంశీధర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఉద్యోగ బాధ్యత తీసుకోవడం హర్షణీయం

కమలాపురం : విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడంతో పాటు ఉద్యోగ బాధ్యత కూడా ప్రభుత్వమే తీసుకోవడం హర్షణీయం అని మండల తహసీల్దార్ నారాయణరెడ్డి తెలిపారు. బుధవారం స్థానిక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో చివరి సంవత్సరం విద్యార్థులకు స్కిల్ డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో జాబ్ మేళా (ప్లేస్‌మెంట్) నిర్వహించి ఉద్యోగాలకు ఎంపికైన విద్యార్థులకు ఆయన నియామక పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కార్పోరేట్ పాఠశాలలు, కళాశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలను తీర్చిదిద్దిందన్నారు. పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్లేస్‌మెంట్ డ్రైవ్‌లను నిర్వహించి, స్థానిక పరిశ్రమలకు అనుసంధానం చేసి పెద్ద ఎత్తున ఉద్యోగ అవకాశాలు కల్పించిందన్నారు. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయంతో అనేక మంది విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు లభించాయన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ మార్పూరి మేరి, 4వ వార్డు కౌన్సిలర్ నిఖిల్‌రెడ్డి పాల్గొన్నారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

వీరపునాయునిపల్లె : మండల ప్రజా పరిషత్ కార్యాలయ సభా భవనంలో గురువారం ఉదయం 10 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు మండల అభివృద్ధి అధికారి చంద్రశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ సమావేశానికి ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి, మండల అధ్యక్షుడు రఘునాథరెడ్డి, పలువురు ప్రజా ప్రతినిధులు హాజరవుతారని అన్ని శాఖల మండలస్థాయి అధికారులు పూర్తిస్థాయి నివేదికలతో హాజరుకావాలని ఆయన కోరారు.

నేటి నుంచి లక్ష్మీనరసింహస్వామి ఉత్సవాలు

పెండ్లిమర్రి : మండలంలోని పాతసంగటిపల్లె గ్రామంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి వార్షికోత్సవ ఉత్సవాలు గురువారం నుంచి మూడు రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆలయ ధర్మకర్త చెన్నారెడ్డి, ఈఓ మహేశ్వర్‌రెడ్డిలు తెలిపారు. గురువారం లక్ష్మీనరసింహస్వామి జయంతి, రాత్రికి ఊంజల్ సేవ, శుక్రవారం స్వామి వారికి అభిషేకం, రాత్రికి గరుడ సేవ, శనివారం లక్ష్మీనరసింహస్వామి కల్యాణం వంటి కార్యక్రమాలు వేదపండితుల ఆధ్వర్యంలో నిర్వహిస్తామన్నారు. భక్తులకు అన్నదానం కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. అలాగే బండలాగుడు పోటీలను శుక్రవారం ఓల్డ్ క్యాటగిరి ఎద్దులచే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మొదటి బహుమతి రూ.50వేలు, రెండవది రూ.40వేలు, మూడవది రూ.30వేలు, నాల్గవది రూ.25వేలు, ఐదవది రూ.20వేలు, ఆరవది రూ.15వేలు అందజేస్తామన్నారు.

వైభవంగా ధ్వజారోహణం



ధ్వజ స్తంభానికి ప్రత్యేక పూజలు చేస్తున్న వేదపండితులు

పెండ్లిమర్రి : మండలంలోని చిన్నదాసరిపల్లె గ్రామ సమీపంలోని వెయ్యినూతలకోన పుణ్యక్షేత్రంలో వెలసిన శ్రీలక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం ధ్వజారోహణం కార్యాక్రమాన్ని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త పి.నరసింహహరిప్రసాద్ ప్రారంభించారు. వేదపండితుల ఆధ్వర్యంలో యాగశాల ప్రవేశం, శాంతి హోమం, రాత్రి శేషవాహన సేవ వంటి కార్యాక్రమాలు వైభవంగా నిర్వహించారు.భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి మొక్కులు తీర్చుకొని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అలాగే నేడు నరసింహస్వామి జయంతి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు.

నేటి నుంచి పెంచలకోనకు ప్రత్యేక బస్సులు

బద్వేలు అర్బన్ : పెనుశిల లక్ష్మీనరసింహస్వామి (పెంచలకోన) బ్రహ్మోత్సవాల సందర్భంగా గురువారం నుంచి శనివారం వరకు మూడు రోజుల పాటు బద్వేలు డిపో నుంచి పెంచలకోనకు 12 స్పెషల్ బస్సులు నడపనున్నట్లు బద్వేలు డిపో మేనేజర్ శ్రీనివాసరావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు

ఘనంగా రామాలయ వార్షికోత్సవం

వల్లూరు : స్థానిక జిల్లా పరిషత్ హైస్కూలు సమీపంలో వెలసిన కోదండరామాలయ దశమ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం సీతారామలక్ష్మణ ఆంజనేయ స్వాముల మూల విరాట్‌లకు అర్చకులు అభిషేకాలను నిర్వహించి, విశేష పూజలను నిర్వహించారు.

విద్యార్థులకు మెళకువలు అవసరం



మాట్లాడుతున్న సీఐ భాస్కర్ రెడ్డి

వైవీయూ : పోటీ పరీక్షల్లో రాణించేందుకు సన్నద్ధమయ్యే విద్యార్థులు విజేతలుగా రాణించేందుకు మెళకువలు పాటించాలని పోలీసుశాఖ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ డి.భాస్కర్ రెడ్డి సూచించారు. కడప నగరంలోని ప్రభుత్వ పురుషుల కళాశాలలో కళాశాల విద్యార్థులకు కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వరలో పోలీస్ రిక్రూట్‌మెంట్ పరీక్షలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీసుశాఖలో ఉద్యోగం సాధించాలన్న తపన కలిగినవారు అందుకు తగ్గట్టుగా శ్రమించాలన్నారు. అనంతరం పోటీపరీక్షలకు ఎలా సన్నద్ధం కావాలో వివరించారు. ప్రిన్సిపాల్ జి. రవీంద్రనాథ్, వైస్ ప్రిన్సిపాల్ పి. రమేష్, కెరీర్ గైడెన్స్ సెల్ కన్వీనర్ డి.వీరనాగేంద్రకుమార్ పాల్గొన్నారు.

యువత సమస్యలపై పోరాటాలు



ఏఐవైఎఫ్ జెండాను ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

కడప వైఎస్ఆర్ సర్కిల్ : దేశంలో నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న సమస్యలపై క్రియాశీలక పోరాటాలను చేపట్టనున్నట్లు సీపీఐ జిల్లా కార్యదర్శి చంద్ర పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఏఐవైఎఫ్ 64వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువతను రాజకీయ, ఆర్థిక, సామాజిక చైతన్యవంతులను చేసి యువత ఎదుర్కొంటున్న సమస్యలపై పోరాటాలు చేసేందుకు ఏఐవైఎఫ్ ఏర్పాటు చేశారన్నారు. రాష్ట్రంలో ఖాళీగా ఉన్న రెండు లక్షల 25 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని డిమాండ్ చేశారు. గ్రూప్–2 నోటిఫికేషన్ వెంటనే విడుదల చేయాలన్నారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మోడీ ప్రభుత్వం ఏడాదికి రెండు కోట్ల ఉద్యోగాలు ఇస్తామని చెప్పి ఒక్క ఉద్యోగం కూడ ఇచ్చిన దాఖలాలు లేవని విమర్శించారు. ఈ కార్యక్రమంలో ఏఐవైఎఫ్ నాయకులు దస్తగిరి, మైనుద్దీన్, చైతన్య, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

కడప నగరంలో వాహనాల తనిఖీలు



కడప టూటౌన్ పరిధిలోని వక్కలపేటలో వాహనాల తనిఖీ చేస్తున్న ఎస్ఐ జయరాముడు

కడప అర్బన్ : కడప నగరంలోని ఎస్పీ బంగళా సర్కిల్ సమీపంలో బుధవారం సాయంత్రం ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి వాహనాల తనిఖీ చేశారు. మైనర్ యువకుల డ్రైవింగ్‌పై ప్రత్యేక దృష్టి సారించారు. వాహనాల రికార్డులు, డ్రైవింగ్ లైసెన్స్‌లను పరిశీలించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారికి జరిమాన విధించారు. లైసెన్స్‌లేని మైనర్ యువకులు వాహనాలు నడిపితే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

- కడప టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో వక్కలపేటలో డ్రైవింగ్ చేస్తున్న మైనర్‌లకు ఎస్ఐ జయరాములు కౌన్సెలింగ్ నిర్వహించారు. మైనర్లకు బైక్‌లు ఇవ్వవద్దనీ తల్లిదండ్రులకు సూచనలు చేశారు.

అక్రమ నిర్మాణాలను అరికట్టాలి

జమ్మలమడుగు రూరల్ : మండలపరిధిలో అధికారుల అనుమతులు తీసుకోకుండా అక్రమంగా నిర్మిస్తున్న కట్టడాలపై అధికారులు దృష్టి సారించాలని అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వైస్ చైర్మన్ వై.ఓ.నందన్ తెలిపారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో మైలవరం, పెద్దముడియం మండలాల పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఆయన సమావేశాన్ని నిర్వహించి మాట్లాడారు. పంచాయతీ కార్యదర్శుల పరిధిలోని అయా సచివాలయాల్లోని పరిధిలో భవన నిర్మాణాలు, లేఅవుట్‌లకు అధికారుల అనుమతులు తీసుకోకుండా నిర్మించడం వల్ల పంచాయతీకి రావలసిన ఆదాయానికి గండి పడుతున్నదని ఆయన తెలిపారు. భవనాలు నిర్మిస్తున్నప్పుడు తప్పనిసరిగా అప్రూవల్ తీసుకొనేవిధంగా చూడలన్నారు. అలా తీసుకోని వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. 300 చ.మీ. వరకు పంచాయతీ కార్యదర్శులతో ఆపైన భవన నిర్మాణాలు, లేఅవుట్లకు అన్నమయ్య అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ వారితో అనుమతులు పొందాలన్నారు. ఇందులో ఏ మాత్రం అలసత్వం వహించిన అధికారులపై చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ప్లానింగ్ అధికారి టి.కృష్ణసింగ్, డీఎల్పీఓ విజయ్‌కుమార్ ఎంపీడీఓ అరుంధతి తదితరులు పాల్గొన్నారు.

వన్‌టౌన్ స్టేషన్‌ను పరిశీలించిన డీఎస్పీ



కడప ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించిన డీఎస్పీ ఎం.డి షరీఫ్

కడప అర్బన్ : కడప నగరంలోని ఒన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌ను బుధవారం డీఎస్పీ ఎం.డి షరీఫ్ పరిశీలించారు. పోలీస్‌స్టేషన్‌లోని గదులను, పై భాగానున్న కమాండ్ కంట్రోల్ సిస్టం కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం కడప ఒన్‌టౌన్ సీ.ఐ ఎన్.వి నాగరాజు, ఎస్ఐ మధుసూదన్‌రెడ్డి, సిబ్బందితో పలు అంశాలపై సూచనలు చేశారు.

కొనసాగుతున్న మాక్ పాలీసెట్ పరీక్షలు

పులివెందుల టౌన్ : పట్టణంలోని అహోబిలాపురం ప్రభుత్వ ఉన్నత (మెయిన్) పాఠశాలలో బుధవారం స్నేహిత అమృతహస్తం సేవా సమితి ఆధ్వర్యంలో మాక్ పాలీసెట్ పరీక్ష నిర్వహించారు. మూడు రోజులుగా ఉచిత విద్య ఉపాధ్యాయ బృందం సహకారంతో పాలీసెట్ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న విద్యార్థులు మాక్ పాలీసెట్ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా సేవా సమితి అధ్యక్షుడు రాజు మాట్లాడుతూ ఈ మాక్ పాలీసెట్ పరీక్షలకు పులివెందుల ప్రాంతంనుంచే కాక, అన్నమయ్య, శ్రీసత్యసాయి, అనంతపురం జిల్లాల నుంచి 260 మంది విద్యార్థులు హాజరయ్యారన్నారు. ఈ పరీక్షలు రాయడంవల్ల పాలీసెట్ ప్రవేశ పరీక్షలకు అవగాహన కలిగి ఉండటంతోపాటు ప్రవేశ పరీక్షలో ఉత్తమ ర్యాంక్‌లు సాధించడానికి ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో సేవా సమితి సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాల అడ్మిషన్లు ప్రారంభం

వేంపల్లె : పట్టణంలోని వైఎస్సార్ వివేకానంద ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2023–24 విద్యా సంవత్సరానికి సంబంధించి బీఏ, బీఎస్సీ, బీకాం కోర్సులకు అడ్మిషన్ల పక్రియ ప్రారంభమైందని ఆ కళాశాల ప్రిన్సిపాల్ యోగాంజనేయులు తెలిపారు. బుధవారం ఆయన తెలుపుతూ సైన్స్ విభాగంలో బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, బీఎస్సీ ఎమ్మెస్సీ, బీఎస్సీ బీజెడ్సీ, అలాగే ఆర్ట్స్ విభాగంలో బీకాం కంప్యూటర్ అప్లికేషన్, బీఏ హెచ్ఈసీ, హెచ్‌పీ స్పెషల్ ఇంగ్లీషు గ్రూపులు కలవన్నారు.

నందివాహనంపై ఊరేగిన అగస్త్యేశ్వరుడు



నంది వాహనంపై అగస్త్యేశ్వరస్వామి, గరుడ వాహనంపై అభయ వరద సీతారాములు

ప్రొద్దుటూరు : స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి బ్రహ్మోత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు.

అందులో భాగంగా బుధవారం అగస్త్యేశ్వర స్వామి, రాజరాజేశ్వరి అమ్మవారికి, సీతారామ, లక్ష్మణ, ఆంజనేయస్వామి విగ్రహాలకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. గణపతి, నవగ్రహ హోమాలను నిర్వహించి పూర్ణాహుతి సమర్పించారు. సాయంత్రం నంది వాహనంపై గంగా రాజరాజేశ్వరిదేవి సమేత అగస్త్యేశ్వరస్వామి, గరుడ వాహనంపై అభయ వరద సీతారాముల ఉత్సవ మూర్తులను ఊరేగించారు. పూజా కార్యక్రమం అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వినియోగం జరిగింది.

ప్రొద్దుటూరు నుంచి షిర్డీకి ప్రత్యేక బస్సు

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు ఆర్టీసీ డిపో నుంచి షిర్డీకి ప్రత్యేక ఏసీ బస్సు సౌకర్యాన్ని ఏర్పాటు చేసినట్లు డిపో మేనేజర్ ఎ.మల్లికార్జునరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 12వ తేదీ సాయంత్రం 5 గంటలకు డిపో నుంచి బస్సు బయల్దేరుతుందని పేర్కొన్నారు. రానుపోను కలిపి టికెట్ ధర రూ.4,500 చెల్లించాలని ఆయన పేర్కొన్నారు. మధ్యలో తుల్జాపూర్ భవాని మాత ఆలయం, శని సింగనపూర్ ఆలయాల్లో స్వామివారి దర్శనం కల్పిస్తామని వివరించారు. బుకింగ్ కోసం బస్టాండ్‌లో కానీ, www.apsrtconline.in లో సంప్రదించాలని కోరారు. భక్తుల సౌకర్యార్థం ప్రొద్దుటూరు నుంచి తొలి మారు బస్సు సౌకర్యాన్ని కల్పిస్తున్నామని వివరించారు.